సాక్షి నిర్మల్

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



ట్రిపుల్‌ఐటీలో ముగిసిన శిక్షణ

బాసర ట్రిపుల్‌ఐటీ వారం రోజులు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ శుక్రవారం ముగిసింది. 35 మంది పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. 10లో▸



సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.3 /16.7

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ వేడి ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోతగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

శెనగ కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: కుభీర్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం శెనగ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. రైతులు మధ్య దళారులకు తక్కువ ధరకు అమ్మకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు మార్కెట్‌లో విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగచరణ్, మాజీ జెడ్పీటీసీ చవాన్, శంకర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మార్కెట్ సెక్రెటరీ శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డీఈ నాగేశ్వర్, సీవో క్రాంతికుమార్, వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, డి.రాములు, సాహెబ్‌రావ్, సర్పంచ్ కె.గంగాధర్, ఎంపీటీసీ కృష్ణకళ గంగారావ్ తదితరులు పాల్గొన్నారు.

శెనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శెనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రైతులు శెనగలను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మగ్దుమ్, సర్పంచులు రాంరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

జాగిలం సంరక్షకుడికి అభినందన



నిర్మల్‌టౌన్: హైదరాబాద్ మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో 8 నెలల శిక్షణలో భాగంగా 28 పోలీస్ జాగిలాలతో పోటీపడి ట్రైనింగ్ పొంది రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన జాగిలం మూడో స్థానంలో నిలవడం అభినందనీయమని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జాగిలం సంరక్షకుడు మధుకర్‌ను మెడల్ సర్టిఫికెట్‌తో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేర పరిశోధనలో పోలీస్ జాగిలాలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. హత్య, దోపిడీ, దొంగతనాల్లో నిందితులను పట్టుకునేందుకు ఈ జాగిలాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.

'బీజేపీని గద్దె దించాలి'

ముధోల్: దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విలాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ పాలనలో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మికులను రోడ్డున పడేస్తోందని ఆరోపించారు. తెలంగాణపై అభిమానం ఉంటే ఆదిలాబాద్‌లో మూసివేసిన సీసీఐ పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో నాయకులు బాదర్, కొండిబా, శివాజీ , గౌతం, బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడురోజులు బీట్ బంద్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్‌లో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులు బుసార బీట్ బంద్ ఉంటుందని ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి అడెల్లు ఒక ప్రకటనలో తెలిపారు. శివరాత్రి సందర్భంగా శనివారం , ఆదివారం సెలవురోజు, సోమవారం అమావాస్య సందర్భంగా ఎలాంటి కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు.

జగమంతా నీవేకదరా జంగమా..

నాలోన శివుడు.. నీలోన శివుడు.. ఏ దిక్కు చూడు కనిపించు భోళాశంకరుడు.. అన్నట్లు జిల్లా నలుమూలలా కొలువయ్యాడు అర్ధనారీశ్వరుడు. అల బాసరలో పాపహరేశ్వరుడి నుంచి ఈ కొన కడెంలో అంగడీశ్వరుడి దాకా వెలసిన పరమేశ్వరుడు ఒక్కో మండలంలో ఒక్కో పేరుతో పూజలందుకుంటున్నాడు. 'శంకరా.. కరుణించరా..' అని భక్తులు పిలిస్తే 'కదిలె'మన పాపహరేశ్వరుడు. వేములవాడ వెళ్లేదారిలో బూరుగుపల్లి, బాబాపూర్‌లో రాజేశుడిగా కొలువయ్యాడు. గోదారి ఒడ్డున బ్రహ్మేశ్వరుడిగా, సిద్ధేశ్వరుడిగా స్థిరపడ్డాడు. ఒక్క నిమ్మలలోనే ఓంకారేశ్వరుడిగా, రాజరాజేశ్వరుడిగా, రామలింగేశ్వరుడిగా, గుట్ట వీరేశ్వరుడిగా, శివకోటీశ్వరుడిగా, నగరేశ్వరుడిగా నిత్య పూజలందుకుంటున్నాడు. అక్కడ, ఇక్కడ కాదు.. జిల్లాలో ఎక్కడ చూసి'నా శివుడే..' అడుగడుగు'నా శివుడే..' మహాశివరాత్రి పర్వదినాన జిల్లాలోని ప్రసిద్ధ, ప్రముఖ శైవాలయాలపై ప్రత్యేక కథనం.

- నిర్మల్



- ఎటుచూసి'నా శివుడు'
- పాపహరేశ్వరుడిగా 'కదిలి'..
- బూరుగుపల్లిలో మెదిలి..
- అంతటా కొలువైన అర్ధనారీశ్వరుడు
- ప్రతీ ఆలయానికి ప్రత్యేకత
- శివరాత్రికి ముస్తాభైన జిల్లా శైవక్షేత్రాలు



గోదావరి ఒడ్డున బ్రహ్మేశ్వరుడిగా..

లోకేశ్వరం: మండలకేంద్రం నుంచి ధర్మోరా, రాయపూర్‌కాండ్లి మీదుగా 12 కి.మీ. దూరంలో గోదావరి ఒడ్డున బ్రహ్మేశ్వరాలయం ఉంటుంది. జిల్లాలోనే అతిప్రాచీన ఆలయంగా బ్రహ్మేశ్వరాలయాన్ని చెప్పవచ్చు. పార్వతీపరమేశ్వరులు ఇక్కడి గోదావరి ఒడ్డున అడుగుపెట్టినట్లు చెబుతుంటారు. ఇక్కడ సూర్యకిరణాలు గోదావరిపై పడి శివలింగంపై ప్రతిబింబించేవి. మరమ్మతుల తర్వాత ఇప్పుడు అలా కిరణాలు పడటం లేదు.

వేములాడ దారిలో.. బూరుగుపల్లి ఒడిలో..

మామడ: నిర్మల్–ఆదిలాబాద్ ఎన్‌హెచ్ 44 బైపాస్ పక్కనే, చుట్టూ పచ్చని అడవిలో బూరుగుపల్లి ప్రాచీన శివాలయం ఉంది. శివుడు కాశీ నుంచి వేములవాడ వెళ్తుండగా ఇక్కడ సేదదీరినట్లు చెబుతుంటారు. ఇక్కడ దాదాపు 500 ఏళ్ల కిందటిదిగా చెప్పే ఆలయం, కోనేరు ఉన్నాయి. జిల్లాలో కదిలి తర్వాత బూరుగుపల్లి రాజరాజేశ్వరాలయం ప్రసిద్ధి చెందింది. శివరాత్రికి వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.

మన ఎములాడ 'బాబాపూర్'..



లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్‌లో కొలువుదీరిన రాజరాజేశ్వరాలయం జిల్లా వేములవాడగా ప్రసిద్ధి. గ్రామానికి చెందిన రాజన్న పటేల్‌కు కలలోకి జంగమయ్య వేషధారణలో వచ్చిన పరమేశ్వరుడు బూరుగుపల్లి నుంచి వేములవాడ వెళ్తూ నీ తోటలో నేను పాదం మోపానని చెప్పి, ఇక్కడ స్వయంభూగా శివలింగం వెలిసిందని చెబుతారు. శివరాత్రికి మూడు రోజుల జాతర కొనసాగుతుంది. వేములవాడలో ఉన్నట్లు ఇక్కడ భక్తులు తాము కోరిన కోరికలు తీరడంతో స్వామివారికి బెల్లంతోపాటు కోడె మొక్కులు తీర్చుకుంటారు.

గొడిసిర్యాల రాజన్న..

దస్తురాబాద్: మండలంలోని దస్తురాబాద్–జన్నారం దారిలో మండలకేంద్రం నుంచి 10కి.మీ. దూరంలో గొడిసిర్యాల రాజరాజేశ్వరాలయం ఉంది. ఇక్కడ శివరాత్రి రోజున రాత్రికి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అదే రాత్రి శివుడి మెడలో ఉండే నాగుపాము ఆలయ గర్భగుడిలో కనిపించడం విశేషం. చుట్టుపక్కల జిల్లాల నుంచీ భక్తులు భారీగా దర్శనానికి వస్తుంటారు.

ఎలగడపలో అంగడీశ్వరుడు..



కడెం: మండలకేంద్రం నుంచి లింగాపూర్, నచ్చన్ ఎల్లాపూర్ దారుల్లో పదికిలోమీటర్ల దూరం వెళ్తే అంగడీశ్వరుడు దర్శనమిస్తాడు. ఇక్కడి ఎలగడప–పాత మద్దిపడగ గ్రామాల మధ్యలో 400 ఏళ్ల క్రితం అంగడయ్య అనే సద్గురువు నెలకొల్పిన మహిమాన్విత శివాలయమిది. ఆయన పేరు మీదుగానే అంగడీశ్వరాలయంగా ప్రఖ్యాతి చెందింది.

ఇటిక్యాలలో రాజరాజేశ్వరుడే..



పెంబి: మండలకేంద్రం నుంచి తాటిగూడ మార్గంలో 8కి.మీ వెళ్తే ఇటిక్యాల రాజరాజేశ్వరుడిని దర్శించుకోవచ్చు. పురాతన ఆలయంలో కొలువైన శివుడికి మహాశివరాత్రి రోజు ప్రత్యేకంగా పూజలు చేస్తారు. అడవి బిడ్డలైన ఆదివాసులూ ఇక్కడి స్వామిని దర్శించుకుంటారు.

రంగపేటలో రాజరాజేశుడు..

ఖానాపూర్: మండలకేంద్రం నుంచి 16 కి.మీ. దూరంలో, బీర్నంది వెళ్లే దారిలో రంగపేటలో గుట్టపై రాజరాజేశ్వరుడు వెలిశాడు. కోరిన కోర్కెలు తీర్చే సత్యదేవుడిగా పేరొందాడు. పండుగకు ముందునుంచే ఇక్కడ జాగారం ఉంటారు. అలాగే దిలావర్‌పూర్‌లో రాజేశ్వర, పాతఎల్లాపూర్‌లో మహాదేవ అన్నపూర్ణ పురాతన ఆలయాలు భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నాయి.

'ఓలా'ద్రీశ్వరుడిగా..

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ప్రాచీన ఆలయంలో ఓలాద్రీశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. 300 ఏళ్ల క్రితం వెలిసిన శివయ్యకు మళ్లీ 2018లో నూతన ఆలయం నిర్మించారు. ఇదే మండలంలోని సూర్యాపూర్‌లో రాజేశ్వరాలయానికీ చరిత్ర ఉంది. తిప్ప గజ్జారాం అనే భక్తుడు ఉపవాస దీక్ష చేసి ఆలయాన్ని నిర్మింపజేశాడు. శివరాత్రి ఇక్కడ కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.

ముధోల్‌లో పశుపతినాథుడిగా..



ముధోల్: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలోనే పశుపతినాథ ఆలయం ఉంది. ఎక్కడో నేపాల్‌లో ఉన్న పశుపతినాథుడిని దర్శించుకోలేని భక్తులు ఇక్కడ దర్శించుకుంటారు. తవ్వకాల్లో బయటపడిన పురాతన శివలింగమిది. మహాశివరాత్రి పర్వదినాన విశేషంగా పూజలు నిర్వహిస్తారు.

బాసరలో పాపహరేశ్వరుడిగా..

బాసరక్షేత్రంలో పాపహరేశ్వరుడిగా శివుడు కొలువుదీరాడు. చోళుల కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు చెబుతుంటారు. ఇక్కడి స్వామివారికి పవిత్రత ఉన్నట్లు భావిస్తారు. ఇక్కడి దీపపు స్తంభంపై దీపం వెలిగిస్తే చుట్టూ ఉన్న గ్రామాలకు దిశానిర్దేశంగా ఉండేది. ఇటీవలే ఈ దీపపు స్తంభాన్ని దొంగిలించారు.

నిమ్మల అణువణువునా..

నిర్మల్: పట్టణంలో ఏ కొన చూసిన ఆ శివయ్య దర్శనమిస్తాడు. వెంకటాద్రిపేటలో ఖజానా చెరువు ఒడ్డున ఓంకారేశ్వరుడిగా కొలువయ్యాడు. పార్వతీసమేతంగా పరమేశ్వరుడు కలిసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. రథాలగుడిలో కేదారేశ్వరుడిగా, నగరేశ్వరవాడలో నగరేశ్వరుడిగా, బుధవార్‌పేట్‌లో శివకోటీశ్వరుడిగా, నాయుడివాడ గుట్టపై వీరన్నగా, రామన్నగండిలో గుహలోని రామలింగేశ్వరుడిగా, బేస్తవార్‌పేటలో రాజరాజేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. ఈ ఆలయాలన్నీ దాదాపు 500 ఏళ్ల క్రితం నిర్మించినవే కావడం విశేషం.

సీఎంఆర్‌పై సీరియస్ ఏది?



ధాన్యం దందా!



సీఎంఆర్ 23 శాతమే!

సాక్షిలో ప్రచురితమైన కథనాలు

- రీసైక్లింగ్ దందాపై అధికారుల చర్యలు కరువు
- జెడ్పీ వేదికగానే ప్రజాప్రతినిధుల మండిపాటు

భైంసాటౌన్: జిల్లాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాను అడ్డుకోవాలని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే మండిపడుతున్నారంటే దందా ఏస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. రూ.కోట్లలో అక్రమదందా జరుగుతుంటే సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి సమక్షంలో జెడ్పీ సమావేశం వేదికగా సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం రైస్‌మిల్లులకు కేటాయిస్తుండగా చాలామంది మిల్లర్లు రేషన్‌బియ్యాన్నే పాలిష్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. ఫలితంగా నాసిరకం బియ్యం అంటగడుతూ ధాన్యం పక్కదారి పట్టిస్తూ రూ.కోట్లలో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. దీనిపై 'సాక్షి' పలుమార్లు కథనాలు సైతం ప్రచురించింది. అయినా సంబంధిత శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించడం లేదు.

సీఎంఆర్‌లో జాప్యం అందుకేనా..!

ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రభుత్వం రైతుల నుంచి వరిధాన్యం సేకరిస్తుంది. ఇలా సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం రైస్‌మిల్లులకు అప్పగిస్తుంది. రైస్‌మిల్లర్లు క్వింటాలు ధాన్యానికి 67కిలోల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. ధాన్యం మరాడించి నిర్ణీత గడువులోగా బియ్యం అందించాలి. కానీ ఏటా ప్రభుత్వం ధాన్యం మిల్లులకు కేటాయించడం, గడువు ముగిసినా మిల్లర్లు లక్ష్యం చేరుకోకపోవడం పరిపాటిగా మారింది. ఎందుకంటే ధాన్యం మరాడించి బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాలంటే గిట్టుబాటు కాదని చాలావరకు రైస్‌మిల్లర్లు అక్రమమార్గం ఎంచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ధాన్యం ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్‌బియ్యం దళారుల ద్వారా కొనుగోలు చేసి వాటినే పాలిషింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారన్న విమర్శలున్నాయి.

పేరుకే ఎన్‌ఫోర్స్‌మెంట్..!

సీఎంఆర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులపై ఉంది. ఇందుకుగానూ కొన్ని మండలాలకు కలిపి డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నా పేరుకే మాత్రమే అన్నట్లుగా ఉంది. రేషన్‌బియ్యం రీసైక్లింగ్ దందాపై ఎలాంటి తనిఖీలు చేపట్టకుండా 'మామూలు'గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికార పార్టీకి చెందిన నేతలే ఈ దందాపై మండిపడుతుండడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

తనిఖీలు చేపట్టాలి

రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాకు అడ్డుకట్ట పడాలంటే సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరముంది. రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటి వరకు అప్పగించిన, అప్పగించాల్సిన బియ్యం, ఎంతమేర ధాన్యం నిల్వ ఉందన్న అంశాలు పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఎంఎల్‌ఎస్ పాయింట్లతో పాటు రేషన్ దుకాణాల్లో బియ్యం నిలవ్వలు పరిశీలించడం ద్వారా సైతం ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఆదేశించాం

రైస్‌మిల్లుల నుంచి ధాన్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను కూడా ఆదేశించాం.

– తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి, నిర్మల్

ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు నిర్మాణం నిలిపేయండి

- తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పనులు చేయొద్దు
- నాయబ్‌ట్యాంక్ పిటిషన్‌పై హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నిర్మల్‌లోని నాయబ్ ట్యాంక్ ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) పరిధిలో రోడ్డు నిర్మాణం నిలిపివేయాలని, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేసింది. నాయబ్ ట్యాంక్ ఎఫ్‌టీఎల్ పరిధిలో భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, ఇది చట్టవిరుద్ధమని నిర్మల్‌కు చెందిన కె.అనూజ్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.సూర్యకరణ్‌రెడ్డి వాదనలు వినిపించారు. నాయబ్ ట్యాంక్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గత సంవత్సరం మరో కేసు విచారణ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చెరువు పరిరక్షణ కోసం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆదేశించిందని వెల్లడించారు. అయినా అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిని కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి వస్తుందని నివేదించారు. పనులు ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జీపీ అనంత నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. అక్కడ రహదారి 40 ఏళ్లుగా ఉందని, ఇప్పుడు కేవలం వైండింగ్ కోసమే చర్యలు చేపట్టినట్లు వివరించారు. అవసరమైతే గూగుల్ మ్యాప్ కూడా కోర్టుకు అందజేస్తామని చెప్పారు. ప్రజల సౌకర్యం కోసమే రోడ్డు విస్తరణ చేస్తున్నామని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం .. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి పనులు చేయొద్దని న్యాయమూర్తులు ఆదేశించారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి



కిష్టాపూర్‌లో మాట్లాడుతున్న రమాదేవి

లోకేశ్వరం/పెంబి: తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలన సాగిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి ఆరోపించారు. లోకేశ్వరం మండలం కిష్టాపూర్, పెంబి మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్, ప్రజా గోస–బీజేపీ భరోసా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కి అబద్ధాలు మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారుల ఆశయాలను వమ్ము చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేదలకు, అర్హులకు అందకుండా రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయకపోగా, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈమేరకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర యువ నేత రితీశ్ రాథోడ్, అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, పెంబి, ఖానాపూర్ మండలాల అధ్యక్షులు సదాశివ్, సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ సుమన్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సాయినాథ్‌పటేల్, సాయారెడ్డి, జీవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ క్రింద కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యాధికారుల(బీఏఎంఎస్)పోస్టులు (4), బీహెచ్‌ఎంఎస్(1)పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ విభాగంలో ఉత్తీర్ణులై మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు nirmal.telangana.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత అర్హత పత్రాలను జతచేసి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈనెల 25లోపు సమర్పించాలని వివరించారు.

వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిలో బస్తీ దవాఖాన (3), భైంసా అర్బన్ పిహెచ్‌సీ(1), మెంటల్ హెల్త్ ప్రోగ్రాం(1), ఎంబీబీఎస్(4), సైకియాట్రిస్ట్(1), విభాగాలలో వైద్యుల నియామకాని కి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో ఎంబీబీఎస్, ఎండీ సైకియాట్రి డి ప్లొమా చేసినవారు అర్హులని పేర్కొన్నారు. అర్హ త, ఆసక్తి ఉన్నవారు ఈనెల 22న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

మెరిట్ జాబితా విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ సెలక్షన్ లిస్టు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖా అధికారి కార్యాలయంలో, nirmal.telangana.gov.inలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10:30 గంటలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

బాసరలో కమలానంద భారతిస్వామి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న స్వామి

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని శుక్రవారం కమలానంద భారతిస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో విజయరామారావు కమలానంద భారతిస్వామిని పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఆయన వెంట బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బలుగు నర్సింగ్‌రావు, పట్టణ అధ్యక్షుడు సుభాష్‌యాదవ్ తదితరులున్నారు.

పల్లిపట్టీల్లో పురుగులు



పల్లిపట్టీల్లో పురుగు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం తిప్పకొలాంగూడ గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు పంపిణీ చేసిన పల్లిపట్టీల్లో పురుగులు కనిపించాయి. సమాచారం తెలుసుకుని కేంద్రానికి చేరుకున్న గ్రామపటేల్ భగవంత్‌రావ్, చిన్నారుల తల్లిదండ్రులు వాటి ఫొటోలు తీసి 'సాక్షి'కి వాట్సప్ ద్వారా పంపించారు. నాసిరకమైన పల్లిపట్టీలు సరఫరా చేస్తే వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీడీఏ అధికారులు నాణ్యమైన సరుకులు సరఫరా చేసి తమ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

ఒకరికి మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ తీర్పు చెప్పారు. లైజన్ అధికారి జీ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 4న పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నజర్ అలీఖాన్ అదే కాలనీలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై మొబీన్ కేసు నమోదు చేశారు. పీపీ మధుకర్ ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, లైజన్ అధికారి వివరించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

సారంగపూర్: రాంసింగ్‌తండాకు చెందిన రైతు చౌహాన్ ఈనేశ్ ఇల్లు గురువారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో దగ్ధమైంది. రేకుల పైకప్పు, నిత్యావసరాలు, ఐదు క్వింటాళ్ల పత్తి కాలిపోయాయి. సుమారు రూ.1.50లక్షల నష్టం జరిగింది. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి అల్లోల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేలా చూస్తానన్నారు. ఎంఆర్‌ఐ ముంతాజ్, నాయకుడు బద్రినారాయణ ఉన్నారు.

ఉరేసుకొని ఒకరి మృతి

ముదోల్: కారేగాం గ్రామానికి చెందిన గొడిసెరం లక్ష్మణ్ (33) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ కొద్దిరోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఇంటివద్ద ఉరేసుకుని హత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులున్నారు.

అంతర్రాష్ట్ర క్రీడలకు C/O జాతర్ల

- రాష్ట్రస్థాయి గ్రామీణ క్రీడా పోటీలకు మొదటి వేదిక ఈ గ్రామమే..
- సింథటిక్ కోర్టు రాష్ట్రంలోనే రెండోది
- ఇది నవజ్యోతి యూత్ క్లబ్ ఘనత
- ఏటా శివరాత్రి సందర్భంగా ఆటలు
- 19నుంచి అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు



సింథటిక్ కోర్టుపై కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)



నవజ్యోతి యూత్‌క్లబ్ భవనం

బజార్‌హత్నూర్: జాతర్ల.. మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామం. ఈ గ్రామంలో 1,868 మంది జనాభా ఉండగా 96 శాతం గిరిజనులే. ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలకు నెలవు ఈ గ్రామం. కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు జాతర్ల పెట్టింది పేరు. ఈ గ్రామం ఐక్యత క్రీడల్లోనూ కనిపిస్తోంది. నాయకత్వ లక్షణాలన్నీ ప్రతిబింబించి ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయి. అందుకే ఈ గ్రామం పేరు జాతీయ స్థాయిలో మార్మోగుతోంది.

జాతీయ ప్రమాణాలతో పోటీలు

కబడ్డీ క్రీడకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెడుతోంది జాతర్ల గ్రామం. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీలు నిర్వహిస్తున్నారు. పెద్ద నగరాలకు పరిమితమైన సింథటిక్ మ్యాట్లపై కబడ్డీ పోటీలు ఇక్కడ తిలకించిన ప్రేక్షకులు టీవీలో చూసిన అనుభూతి పొందుతున్నారు. ఇంతటి ఘనతను నవజ్యోతి యూత్ క్లబ్ సొంతం చేసుకుంది. గ్రామం పేరు నలుచెరుగులా వ్యాపింపజేసింది. అందరి దృష్టిని తమ గ్రామం వైపు చూసేలా చేసింది. పెద్దపెద్ద పట్టణాలను కాదని రాష్ట్ర ప్రభుత్వం, క్రీడాప్రాధికారిక సంస్థ అధికారులు 2016 జనవరిలో ఈ గ్రామంలో 10 జిల్లాలకు చెందిన పాఠశాల క్రీడా జట్లతో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం విశేషం.

ఏటా క్రీడోత్సవాలు

1978లో జాతర్ల గ్రామంలో నవజ్యోతి యువజన సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి గిరిజన సంప్రదాయ పండగలో భాగంగా శివరాత్రి సందర్భంగా ఏటా క్రీడోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మూడురోజుల పాటు గ్రామీణ క్రీడలు నిర్వహించాలని సంకల్పించారు. ఇలా మొదలైన వీరి సంకల్పం నేడు రాష్ట్ర స్థాయి పోటీల వరకు వచ్చింది. ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేశ్ నవజ్యోతి యూత్‌క్లబ్ ప్రారంభమైనప్పుడు అందులసభ్యుడిగా ఉండి నేడు గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఒకే మాట.. ఒకే బాట

జాతర్ల గ్రామంలో అల్లర్లు, గొడవలుండవు. గ్రామస్తులంతా ఊళ్లో ఏ కార్యక్రమం జరిగినా గ్రామపెద్ద ఆదేశాల మేరకు ఐక్యంగా కృషి చేస్తారు. ప్రతీ కార్యక్రమంలో తరతమ భేదం లేకుండా ఊరంతా పాల్గొంటారు. గతంలో రాజీవ్ ఖేల్ అభియాన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఈ గ్రామం వేదికైనపుడు గ్రామస్తులంతా పండగ వాతావరణంలో నిర్వహించేందుకు తోడ్పడ్డారు. మారుమూల గ్రామమైనా అన్ని సౌకర్యాలతో పంచాయతీ కమ్యూనిటీ హాల్, రక్షిత మంచినీటి పథకం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, కేంద్రియ ఆదర్శ క్రీడా పాఠశాల, ఆరోగ్య ఉప కేంద్రం, నవజ్యోతి యూత్ క్లబ్ భవనం, మినీ స్టేడియం, రాయిసెంటర్ భవనం, గిరిజన బాలుర వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి.



జాతర్లలో మినీ స్టేడియం

ఆటలు.. వసతులు

ఏటా ఈ గ్రామంలో నిర్వహించే క్రీడాపోటీలకు ఇతర జిల్లాలతో పాటు, మహారాష్ట్ర నుంచి క్రీడాకారులు వచ్చి తలపడుతుంటారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్ తదితర ఆటలు ఆడుతుంటారు. క్లబ్ ద్వారా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఆటగాళ్లకు ఉచితంగా భోజనం అందిస్తారు. కమ్యూనిటీ హాల్, రాయిసెంటర్ భవనం, యూత్‌క్లబ్ భవనంలో వసతి కల్పిస్తారు. క్రీడాకారులు గాయపడితే వెంటనే ప్రథమ చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది సహాయం తీసుకుంటారు. ఈ క్రీడా సంగ్రామానికయ్యే ఖర్చులన్నీ యూత్ క్లబ్ సొంతంగా భరిస్తోంది.

పంజాబ్ నుంచి సింథటిక్ మ్యాట్లు

జాతర్లలో మినహా ఆదిలాబాద్ జిల్లాలో మరెక్కడా కనీసం మినీ స్టేడియం లేదు. దీని నిర్మాణానికి 2015లో అప్పటి ఎంపీ గోడం నగేశ్ తన నిధుల నుంచి రూ.15 లక్షలు వెచ్చించారు. ఇక్కడ కబడ్డీ, వాలీబాల్, షటిల్ తదితర ఆటలను ఒకేసారి వేర్వేరుగా ఆడేందుకు పలు క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. మినీ స్టేడియం చుట్టూ ఇనుప కంచె, రాత్రి వేళల్లోనూ క్రీడలు నిర్వహించేందుకు భారీ హైమాస్ట్ లైట్లు అమర్చారు. క్రీడలను తిలకించడానికి వీలుగా ప్రేక్షకులకు ప్రత్యేకంగా గ్యాలరీ నిర్మించారు. కబడ్డీ ఆటలకు జాతీయ స్థాయిలో కార్పొరేట్ కంపెనీలు నిర్వహిస్తున్న ప్రోకబడ్డీలో వాడే సింథటిక్ మ్యాట్లను రూ.8లక్షల వ్యయంతో పంజాబ్‌లోని పాటియాల నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. దీంతో గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ కబడ్డీ కోర్టులో ఆడే అవకాశం కలిగింది. తెలంగాణలో జాతర్ల, ఆదిలాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని మైదానంలో రెండుచోట్ల మాత్రమే సింథటిక్ మ్యాట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉపాధ్యాయులు ప్రోత్సహించారు



మాది బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్ గ్రామం. 2016 జనవరిలో నవజ్యోతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతర్ల గ్రామంలో నిర్వహించిన రాష్ట స్థాయి గ్రామీణ క్రీడల్లో ఆదిలాబాద్ కబడ్డీ జట్టుకు సారథిగా బరిలోకి దిగి విజయం సాధించాను. తర్వాత ఫిబ్రవరిలో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయస్థాయి గ్రామీణ క్రీడల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొన్నాను. పాఠశాల నుంచి ఉపాధ్యాయులు నన్ను ప్రోత్సహించారు. అందుకే నేను ఈ స్థాయికి చేరాను.

– గొడం వీరమ్మ, వర్తమన్నూర్

ఐక్యతతో పోటీలు నిర్వహిస్తాం



జాతర్ల గ్రామంలో మా ఊరి పెద్దలు 1978 నుంచి ఏటా శివరాత్రి పర్వదినాన అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం అంతర్రాష్ట్ర క్రీడా పోటీల్లో గ్రామంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేస్తారు. యువత, చిన్నా పెద్దా వయస్సు భేదం లేకుండా అంతా కలిసికట్టుగా క్రీడలు నిర్వహిస్తాం.

– మడవి వినోద్, నవజ్యోతి యూత్‌క్లబ్ సభ్యుడు

ఐకమత్యమే మా గొప్పతనం



జాతర్ల గొప్పతనమంతా మా ఐక్యతలోనే ఉంది. చిన్నా పెద్దా అంతా మాటపై నిలబడతాం. అభివృద్ధి బాటలో పయనిస్తున్నాం. 1961లో మా తండ్రి, మాజీ గిరిజన శాఖ మంత్రి గోడం రామారావ్ గ్రామీణ క్రీడలను ప్రారంభించారు. అప్పటి నుంచి పోటీలు కొనసాగిస్తున్నాం. క్రీడలతో గ్రామ యువతకు అనేక శాఖల్లో ఉద్యోగాలు వస్తున్నాయి. నేను ఢిల్లీ, హైదరాబాద్ వెళ్లినా పండగలు, కార్యక్రమాలకు తప్పనిసరిగా సొంత గ్రామానికి వస్తాను. దగ్గరుండి కార్యక్రమాలను గ్రామస్తులతో కలిసి నిర్వహిస్తాను. భవిష్యత్ తరాలు దీన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నా.

– గోడం నగేశ్, మాజీ ఎంపీ

ఆటపాటలతో బోధించాలి

నేరడిగొండ: విద్యార్థులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలని నిర్మల్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్టార్స్ కల్చరల్ ఫెస్ట్–2023 కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. 14 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. వరుణ్‌రెడ్డిని సన్మానించారు.

మహిళ ప్రాణాలు కాపాడిన '108'



108లో చికిత్స పొందుతున్న మహిళ

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ తండాకు చెందిన రాముల లక్ష్మి గురువారం సాయంత్రం ఇంటి వద్ద స్పృహతప్పి పడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కూలీ పనుల నుంచి ఇంటికి చేరుకున్న బంధువులు లక్ష్మిని చూసి చనిపోయిందని భావించారు. అయినా 108కు సమాచారం ఇవ్వగా రాత్రి 8.30 ప్రాంతంలో అక్కడికి చేరుకున్న మామడ 108 సిబ్బంది శేఖర్, రాజన్న మహిళ పరిస్థితి గమనించారు. అప్పటికే ప్రాణం పోయిందేమోనని అక్కడున్న గ్రామస్తులంతా చర్చించుకుంటున్నారు. వెంటనే పేషెంట్‌ను ఎగ్జామినేషన్ చేయగా, పల్స్ వీక్ ఉండడంతోపాటు జీఆర్‌బీఎస్–7 ఉండి (షుగర్ లెవళ్ల పడిపోయాయి), బీపీ 70–60 మధ్య ఉంది. కోమాలో ఉందని తెలిపారు. పేషెంట్ పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, డాక్టర్ సలహామేరకు వెంటనే డీ–25 గ్లూకోజ్, ఆర్‌ఎల్, ఆక్సిజన్ పెట్టి తీసుకువెళ్లే క్రమంలో మామడ వరకు వెళ్లేలోపు పేషెంట్ స్పృహలోకి వచ్చిందని 108 సిబ్బంది తెలిపారు. అంబులెన్స్ లేకుంటే లక్ష్మి బతికేది కాదని ఆమె కుటుంబీకులు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

జైనథ్: పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన కుంట నాగిరెడ్డి చేనులో గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు చోరీ చేశారు. విద్యుత్ కనెక్షన్ తొలగించి ట్రాన్స్‌ఫార్మర్ కిందికిదించారు. అందులోని కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం చేను పనులకు వెళ్లిన రైతు ట్రాన్స్‌ఫార్మర్ పడి ఉండడాన్ని గమనించిచాడు. పోలీసులకు సమాచారం అందించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

'హీరాసుక్క మార్గాన్ని అనుసరించాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉట్నూర్‌రూరల్: గోండి ధర్మ గురు హీరాసుక్క చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ భవనంలో నిర్వహించిన గోండి ధర్మ గురు హీరాసుక్క జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. హీరాసుక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. గోండుల సంస్కృతీసంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు హీరాసుక్క కృషి చేశారని కొనియాడారు. ఆదివాసీ తెగల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని తండాలు, గూడేల్లో రక్త హీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా చూస్తామన్నారు. సీఎం గిరి వికాసం పథకం కింద బోర్లు, విద్యుత్‌మోటర్లు మంజూరు చేస్తామని తెలిపారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ.. హీరాసుక్క జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. అనంతరం ఆదివాసీ సమస్యలపై పర్ధాన్‌సంఘం సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిమ గిరిజన సలహా మండలి అధ్యక్షుడు కనక లక్కేరావు, ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ సర్‌మేడి దుర్గు, తహసీల్దార్ భోజన్న, జెడ్పీటీసీ చారులత రాథోడ్, జైవంత్‌రావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆస్పత్రి తనిఖీ

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లోగల ఆయుష్ ఆస్పత్రిని శుక్రవారం రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ పరమేశ్వర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుర్వేద, హోమియో, యునాని ఆస్పత్రుల రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యులకు సూచనలు చేశారు. త్వరలో 20 పడకల ఇన్‌పేషెంట్ విభాగాన్ని అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటారు. ఆవరణలో నాటిన ఔషధ మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ఆయన వెంట సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఫరీదాబేగం, హోమియో మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది కవిత, నవీన్, మంతు తదితరులున్నారు.

న్యూకంజర్ సమీపంలో భారీ కొండచిలువలు



రైతులు హతమార్చిన కొండచిలువలు

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ గ్రామ సమీపంలో నాలుగు భారీ కొండ చిలువలను రైతులు హతమార్చారు. మండల కేంద్రానికి చెందిన రైతులు న్యూకంజర్ సమీపంలోని తమ చేన్లకు వెళ్లేక్రమంలో సరస్వతి కాలువ సమీపంలో ఆగారు. ఆ సమయంలో చెట్ల పొదల నుంచి భారీగా శబ్దం వచ్చింది. అటువైపు వెళ్లి చూడగా అందులో భారీ కొండ చిలువలు కనిపించాయి. షాక్‌తిన్న యువ రైతులు లక్ష్మణచాంద, న్యూకంజర్ గ్రామాల ప్రజలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. రెండు గ్రామాల రైతులు అక్కడకు చేరుకుని నాలుగు కొండచిలువలున్నట్లు గుర్తించి బండరాళ్లు, కర్రలతో కొట్టి హతమార్చారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

సూపర్ స్పెషాలిటీలో పోస్టుల భర్తీకి చర్యలు

- సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- డీఎంఈ డాక్టర్ కే రమేశ్‌రెడ్డి
- కంటివెలుగు శిబిరాల పరిశీలన



ఆదిలాబాద్ టౌన్: శాంతినగర్‌లో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న రమేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు డీఎంఈ డాక్టర్ కే రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఐదు విభాగాల్లో సేవలు అందుతున్నాయని తెలిపారు. త్వరలోనే అన్ని విభాగాల ద్వారా సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. 15 రోజుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రిమ్స్‌లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన పరికరాలున్నాయని, ఇప్పటికే మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. పీజీ పూర్తి చేసిన వారితో ఏడాది పాటు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో సేవలందించేలా చూస్తున్నామని తెలిపారు. వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల్లో తనిఖీ నిర్వహించి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు ఇద్రిస్ అక్బాని, కల్యాణ్‌రెడ్డి, చంపత్‌రావు ఉన్నారు.

కంటివెలుగు శిబిరాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రీడింగ్ గ్లాస్‌లు, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలను వారి ఇండ్లకే పంపించనున్నట్లు వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్‌రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది తదితరులున్నారు.

జైనథ్: మండలంలోని దీపాయిగూడలో కంటివెలుగు శిబిరాన్ని డీఎంఈ రమేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు చేశారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జయ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, శ్రీధర్, శ్రీకాంత్, నైనత పాల్గొన్నారు.

'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రిమ్స్‌లో పనిచేసిన పేషెంట్‌కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన డీఎంఈ రమేశ్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లపాటు విధులు నిర్వహించామని, కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్ట్ పరిధిలో పనిచేసినట్లు తెలిపారు. జనవరి 12 నుంచి ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. దీంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కార్మికులు రజిత, సునీత, అనురాధ, పుష్పలత, అనిల్, శ్రీకాంత్, హన్మాండు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

రిమ్స్ కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. రిమ్స్ ఆస్పత్రిలో డీఎంఈ రమేశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సదరు కాంట్రాక్టర్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. వేతనాల్లో కోత విధిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. 42 మంది సెక్యూరిటీ గార్డులతో పాటు పేషెంట్‌కేర్, శానిటేషన్ సిబ్బందిని అకారణంగా తొలగించినట్లు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఎంఈ కాంట్రాక్టర్‌కు షోకాజు నోటీస్ జారీ చేయాలని రిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, నగేశ్, దిలీప్, లక్ష్మి, రాము, సంతోష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా బిక్కునాయక్ తండాకు చెందిన రాథోడ్ వినోద్ (42) ఈనెల 13న పత్తిని విక్రయించేందుకు వాహనంలో లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం మహారాష్ట్రలోని మాండ్వికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకురాగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పొచ్చన్న తెలిపారు. మృతుడి భార్య రంజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

- తుది రాత పరీక్షకు 876 మందికి అర్హత



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న రెండో విడత ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం ముగిశాయి. 2,696 మందికి 2,350 హాజరు కాగా 876 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై తుది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుది పరీక్షలో మంచి మార్కులు సాధించినవారికే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావ్, రాములునాయక్, సమయ్‌జాన్‌రావ్, ఆర్.వెంకటేశ్వర్లు, డీఎస్పీలు నాగేందర్, ఉమేందర్, పోతారం శ్రీనివాస్, ఉమామహేశ్వర్‌రావ్, సిబ్బంది ఉన్నారు.